క్లుప్తంగా

బత్తలూరు మారెమ్మకు విశేష పూజలు


పూజలు చేసేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె నుంచి మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగుల సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ గంగుల విజయసింహా రెడ్డి తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఆళ్లగడ్డ మండలం బత్తలూరు గ్రామంలో కొలువైన మారెమ్మ, గంగమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గంగుల కుటుంబీకులు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఎర్రగుడిదిన్నెకు చేరుకున్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగభూషణ్‌రాజు

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు చురుగ్గా, వినూత్నంగా ఆలోచించి ఉన్నత స్థానాల్లో నిలవాలని అటల్ ఇంకుబేషన్ సెంటర్ శ్రీకృష్ణదేవరాయ అనంతపురం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగభూషణ్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో ఇన్నోవేషన్స్, ఇంకుబేషన్ సెంటర్ ముగింపు సమావేశం నిర్వహించి ఎంబీఏ, బీకాం విద్యార్థులకు పలు అంశాల గురించి, సొంతంగా ఎలా ఎదగాలో వివరించారు. అలాగే..పరిశ్రమలు, నైపుణ్యం, డిజిటల్ అక్షరాస్యత, వ్యాపార నిర్వహణ, ఆధునిక ఆర్థిక వ్యవస్థను ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సాయికృష్ణ, దుర్గాప్రసాద్‌గౌడ, షాహిన్, సాయికృష్ణ, డాక్టర్ రామకృష్ణారెడ్డి, హేమంత్‌రెడ్డి, జ్యోతి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య పాల్గొన్నారు.

మసీదుకు కూలర్లు విరాళం


గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామ మసీదుకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కూలర్లను విరాళంగా అందజేశారు. శిల్పా సహకారంతో అందజేసిన కూలర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శకుంతలమ్మ, స్థానిక సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మసీదు వద్ద ముస్లిం పెద్దలకు అందజేశారు. వారు మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి ఇబ్బంది పడకుండా వారి కోరిక మేరకు రూ.35వేల విలువజేసే మూడు కూలర్లను అందించినట్లు చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం


బొమ్మలసత్రంలో కూల్ మినరల్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): వేసవి కాలం ముగిసే వరకు నంద్యాల పరిసర ప్రాంత ప్రజలకు కూల్ మినరల్ వాటర్‌ను అందజేస్తామని వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బొమ్మలసత్రం వద్ద కూల్ మినరల్ వాటర్ కేంద్రాన్ని ప్రారంభించారు. నాయకులు సిమెంట్ ప్రసాదరెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, చంద్రనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సురేష్, శివ, మధు పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్యనీరాజనం



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై నిజామాబాద్‌కు చెందిన అందెల రవళి నాట్యాలయం వారిచే సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. శివపంచాక్షరి, శివాష్టకం, భ్రమరాంబికాష్టకం తదితర గీతాలకు బి.సాయి రవళి సుకన్య, అభిలాష, మహతి, ఎస్.ప్రభ, లక్ష్మీప్రసన్న, అక్షిత, వేద, సహస్ర, వర్షశ్రీ, జీవిక, మర్షిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల గ్రామంలో బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. కంబగిరి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి బండలాగుటు పోటీల్లో 20 జతల వృషభాలు పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు తరలివచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో ఆ ప్రాంతం కిటకిటలాడింది.

నెరవేర్చిన హామీలనే
ప్రజలకు చెబుతున్నాం

- మేనిఫెస్టో చూపించే దమ్ము టీడీపీకి లేదు
- పేదల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన
- ఎమ్మెల్యే శిల్పా రవి


రామనాథరెడ్డినగర్‌లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, పీపీ నాగిరెడ్డి

నంద్యాల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు.. అమలు చేస్తున్న హామీలను ప్రజలకు వివరించి చెబుతున్నామని, టీడీపీకి ఇలా చెప్పే ధైర్యం ఉందా అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నాలుగేళ్ల గడువక ముందే సంక్షేమ ప్రథకాల ద్వారా పేదల ఖాతాల్లో రూ.2లక్షల కోట్లు ఎలాంటి అవినీతి లేకుండా జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. శుక్రవారం పట్టణంలోని శిల్పా స్వగృహంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల మేనిఫెస్టోను ఆన్‌లైన్‌లోకూడా లేకుండా చేశారని, తమ పార్టీ మాత్రం ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చామని, ప్రజలకు ఏం చేశామో ఇళ్లకు వెళ్లి వివరిస్తున్నామని చెప్పారు. జగనన్నతో లబ్ధి పొంది ఉంటే తమ ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరుతున్నామన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, డైరెక్టర్లు సునిత అమృతరాజ్, చంద్రశేఖర్, దేశం సుధాకర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దాల్‌మిల్ అమీర్, సుబ్బరాయుడు, సాయిరాంరెడ్డి, బసవేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రామనాథరెడ్డి నగర్‌లో...

పట్టణంలోని రామనాథరెడ్డినగర్‌లో ఎమ్మెల్యే, పీపీనాగిరెడ్డి.. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వం ఏం చేసింది, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏం చేశారనేది ప్రజలకు వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి తలుపునకు జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్లను అతికించారు. అలాగే 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు.

జగన్ వెంటే జనం

శిరివెళ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. శుక్రవారం స్థానిక 2వ గ్రామ సచివాలయ పరిధిలో నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వలంటీర్లు, సచివాలయ గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పాలన తేడాలను వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకొని, పథకాల గురించి వివరించారు. జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు.

ఉయ్యాలవాడ : జగనన్నే మా నమ్మకం అంటూ ఆయన పాలన పట్ల పూర్తి విశ్వసనీయత చూసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన కుటుంబాలకు అభ్యంతరం లేకపోతే జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్ అతికిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పల్లె మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని హరివరం, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, మాయలూరు, నర్సిపల్లె, తదితర గ్రామాల్లో జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు లాలమ్మగారి హుసేనయ్య, పల్లె శ్రీనివాసరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గృహ సారథులు నాగేంద్ర, నాగమ్మ ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ పాలన, ప్రస్తుతం అందుతున్న పథకాలు, పాలన తీరులో తేడాలను వివరించారు. వారి అభిప్రాయాల సేకరణను నమోదుతో పాటు వారి అనుమతితో గృహాలకు స్టిక్కర్లను అతికించి, 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు.

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు 20 పంచాయతీల్లో శక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాణ్యం నాగేష్ తెలిపారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమష్టిగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. అలాగే టీడీపీ పాలనకు నేటి జగనన్న అందజేస్తున్న పాలనతీరును పోల్చి చెప్పారు.

చేసింది చెప్పడానికే ప్రజల్లోకి వెళ్తున్నాం



ఆళ్లగడ్డలో లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే గంగుల, రామసుబ్బారెడ్డి

ఆళ్లగడ్డ: నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెప్పడానికే ధైర్యంగా ఇంటింటికీ వెళ్లి వివరించేందుకు మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమాన్ని ఆళ్లగడ్డ పట్టణంలో ప్రారంభించారు. గృహ సారథులు, సచివాలయ, మండల కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని వంద శాతం సంతృప్తి చెందిన వారి ఇళ్లకు జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకుడు, రామసుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ గజ్జుల రాఘవేంద్రారెడ్డి, పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్లు రామకృష్ణ, నగేశ్ ఉన్నారు.

పాలనలో తేడా చూడండి..: టీడీపీ హయాంలో పథకాల అమలు, సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, నాయకుల తీరును జగనన్న పాలన తీరుతో పోల్చి చూడాలని, తేడా మీకే అర్థమవుతుందని, ప్రజలకు ఎవరు మంచి చేశారో తీర్మానించుకోవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రతి పేదవాడి అవసరాలను గమనించి వారి అభివృద్ధికి పథకాలు నేరుగా పారదర్శకంగా అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ప్రజల్లో జగనన్నపై ఉన్న నమ్మకంతోనే 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదంతో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాయలయంలో పార్టీ జిల్లా పరిశీలకుడు రామసుబ్బారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 'జగనన్నే మా భవిష్యత్' అనే కార్యక్రమం ప్రజల నుంచి వచ్చిందే గానీ.. టీడీపీ లాగా ఊహాలోకంలో విహరిస్తూ భ్ర మల్లో బతకాలనే నైజం కాదన్నారు. తమ పాలనపై వందశాతం సంతృప్తి చెందితేనే ఆశీర్వదించమని ఇంటింటికి వెళ్లి అడిగిందేకు ఎంత ధైర్యం కావాలన్నారు. ఈ ధైర్యం తమకు ప్రజలు ఇచ్చారని, వారు మెచ్చేలా పాలన సాగిస్తుండటంతో తమకు స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. తమ నాయకత్వాన్ని ఎందుకు అంగీకరించాలో వివరిస్తున్నామని, ఇలా టీడీపీ నాయకులు అడగగలరా అని ప్రశ్నించారు. నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారెడ్డి, ఎంపీపీ గజ్జుల రాఘవేంద్రారెడ్డి ఉన్నారు.

దొర్నిపాడు: మండలంలో మా నమ్మకం నువ్వేజగన్ అనే కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. గ్రామ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. సైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, కన్వీనర్లు శాంతయ్య, రఫీ, సురేఖ, హుసేన్‌బాషా, వాసు, సర్పంచి లక్కుమాధవీ, నాయకులు భూమా శ్రీనివాస రెడ్డి, జాకీర్‌బాషా, భూమా కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి , లక్కు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక క్రీస్తు జీవితం


దైవసందేశం ఇస్తున్న బిషప్ పుష్పలలిత,


ఏసుక్రీస్తు నాటక ప్రదర్శనలో సిలువ వేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: సహనం, త్యాగానికి ప్రతీక క్రీస్తు జీవితం అని పలువురు బోధకులు వివరించారు. శుక్రవారం నియోజకవర్గం వ్యాప్తంగా శుభ శుక్రవారం పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సమస్త మానవాళి కోసం క్రీస్తు సిలువ వేయబడిన సందర్భంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే జరుపుకుంటారు. సిలువలో క్రీస్తు పలికిన ఏడు మాటలను రెవరెండ్ ఏసురత్నం వివరించారు. పట్టణంలోని సీఎస్ఐ, ఇమ్మానుయేలు, ఏసుకృప, హోసన్న తదితర మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే రూరల్‌లో ఎస్.లింగందిన్నె, నల్లగట్ల, బత్తలూరు, జి.జంబులదిన్నె, కోటకందుకూరు, చిన్నకందుకూరు, చింతకొమ్మదిన్నె, తదితర గ్రామాల్లో చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

దొర్నిపాడు: మండలంలో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సహనానికి, శాంతికి, త్యాగానికి క్రీస్తు జీవితం చిహ్నంగా క్రైస్తవులు భావిస్తారు. ముఖ్యంగా దొర్నిపాడు, క్రిష్టిపాడు, గుండుపాపాల, డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిందిన్నె, చాకరాజువేముల గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. మానవాళికోసం క్రీస్తు సిలువ వేయబడే ముందు చెప్పే ఏడు మాటలను పాస్టర్ డేవిడ్ పుష్పరాజ్ వినిపించారు.

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో యువతీ యువకులు ఏసుక్రీస్తు వేషాధారణతో నాటక రూపంలో ప్రదర్శన చేశారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్లు మధుసూదన్‌రెడ్డి, బాలస్వామి ఏసు బోధనలు వినిపించారు.

ఉయ్యాలవాడ : మండలంలో గుడ్‌ఫ్రైడే పండుగను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మాయలూరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ భక్తులకు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని అందించారు. అనంతరం శిలువతో గ్రామోత్సవం చేపట్టారు.

నంద్యాల(అర్బన్): సమస్త మానవాళి పాప క్షమాపణ కోసం ఏసుక్రీస్తు శిలువపై ప్రాణత్యాగం చేశారని నంద్యాల డయాసిస్ బిషప్ డాక్టర్ ఎగ్గొని పుష్పలలిత పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా హోలీక్రాస్ కెథడ్రల్ చర్చిలో పవిత్ర పార్థనలు నిర్వహించారు. ఆమె ఏసు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. రెవరెండ్ పాల్‌రాజారావు, జోసెఫ్, మనోజ్, సన్ని, వినయ్‌కుమార్ తదితరులు దైవ సందేశం అందించారు. కాగా.. పట్టణంలోని సీఎస్ఐ పాస్టరేట్-2, సెయింట్ జోసెఫ్ చర్చి, ఆర్‌సీఎం, ఏబీఎం, బేతేలు ప్రార్థనామందిరం, హోసన్న ప్రార్థనామందిరం, ఏసుకృప మినిస్ట్రీస్ చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు చేపట్టారు.


ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు


మాయలూరు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

గోస్పాడు: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో పునరుత్థాన పండుగను పురస్కరించుకుని జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీలు శుక్రవారం ముగియడంతో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీల్లో 42 జట్లు పాల్గొన్నాయి. వాటిలో నంద్యాలకు చెందిన అశోక్ రాయల్స్ విజేతగా నిలిచి రూ.20వేలు గెలుపొందింది. రుద్రవరానికి చెందిన ఏకే టీం రన్నరప్‌గా నిలవడంతో రూ.15వేలు అందజేశారు. సాంబవరం గ్రామానికి చెందిన స్ట్రైకర్స్ టీం మూడో స్థానం సాధించి రూ.10వేలు, చాపిరేవుల గ్రామానికి చెందిన జనసేన-11 టీం నాలుగో స్థానం రూ.8వేలు, యర్రగుంట్ల జట్టు ఐదు స్థానంలో నిలిచి రూ.5వేలు దక్కించుకుంది.

అవుకు టన్నెల్‌ను పరిశీలించిన అడిషినల్ డీజీపీ


పనుల తీరును తెలుసుకుంటున్న అడిషినల్ డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్

అవుకు: మండల పరిధిలోని టన్నెల్ నిర్మాణ పనులను శుక్రవారం రాష్ట్ర అడిషినల్ డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్ పరిశీలించారు. ముందుగా పర్యాటక కేంద్రంగా పేరుపొందుతున్న అవుకు రిజర్వాయర్ వద్ద ఉన్న బోటింగ్ పరిసరాలను, వసతులను పరిశీలించారు. అనంతరం అవుకు టన్నెల్స్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన ట్విన్ టన్నెల్స్‌లో ఫాల్ట్‌జోన్ పనులు ఎంతవరకు జరిగాయి, ఎప్పుడులోపు పూర్తి కావచ్చు అనే విషయాలపై ఆరా తీశారు. అలాగే నూతనంగా నిర్మాణం జరుగుతున్న మూడవ టన్నెల్‌లోకి వెళ్లి ఎలాంటి జాగ్రత్తలు తీసుకొని పనులు చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అవుకు, కొలిమిగుండ్ల ఎస్ఐలు జగదీశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, సిబ్బంది నందునాయక్, నరేష్‌కుమార్ రెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

నంద్యాల(వ్యవసాయం): అందరికీ ఆరోగ్యం - ప్రజారోగ్యం కోసం అంకితమంటూ వైద్యులు నినదించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు. ర్యాలీలో దాదాపుగా వంద మందికి పైగా డాక్టర్లు పాల్గొన్నారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఐఎంఏ దేశ వ్యాప్తంగా సమర్పణ్ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా నడక ర్యాలీ, ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని చెప్పారు. వైద్యులు విజయభాస్కరరెడ్డి, సహదేవుడు, మధుసూదనరావు, నాగమణి, నర్మద, అరుణకుమారి, మాధవి, వసుధ, లక్ష్మిసౌజన్య పాల్గొన్నారు. అలాగే.. నంద్యాల ఐఎంఏ, జిల్లా అటవీ శాఖ సంయుక్త నిర్వహణలో స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఉద్యోగులకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్‌కుమార్ ప్రారంభించారు. ఉద్యోగులకు ఉచిత షుగర్, బీపీ, ఈసీజీ, టుడిఎకో స్కానింగ్ పరీక్షలు చేశారు.

సంగమేశ్వరానికి భక్తుల తాకిడి


వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయంలో పూర్తిగా నీటిమట్టం తగ్గడంతో మండలంలోని సప్తనదుల సంఘమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయం పూర్తిగా బయపడింది. వేసవి ఆరంభం కావడంతో సంగమేశ్వరానికి భక్తుల తాకిడి రోజురోజుకు ఎక్కువవుతోంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు సంగమేశ్వరాలయాన్ని చేరుకుని వేపదారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.సప్తనదుల సంగమ ప్రాంతాన్ని, కృష్ణానది పరవళ్లను, నల్లమల ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనంద పరవశమవుతున్నారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్


విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): విద్యుత్ వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రథమనంది దేవస్థానం సమీపంలో రూ.2 కోట్లతో నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ప్రస్తుతం మూడు సబ్‌స్టేషన్‌లు ఉన్నప్పటికీ, వినియోగదారులు పెరగడంతో అప్పుడప్పుడు కొంత అంతరాయం కలుగుతోందని, దీంతో సమస్య పరిష్కారం కోసం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ఉన్నతాధికారులతో చర్చించి 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. సబ్ స్టేషన్ నిర్మాణ పనులు 2 నెలల్లో పూర్తి చేసి, పట్టణంలోని పద్మావతినగర్, మున్సిపల్ కార్యాలయం, సంజీవనగర్, శ్యామ్ కాల్వ సెంటర్ తదితర ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ అందేలా చూడాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, పట్టణ ఏఈలు సుబ్బారావు, నాగరాజు, రామయ్య, రవికుమార్, బెస్త సంఘం రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల(సిటీ): ప్రజా ప్రయోజనాల నిమిత్తం ఏర్పాటు చేసిన పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్ వద్ద పార్కును అధికారులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే 12 పార్కులను గుర్తించి తొమ్మిదింటిని ఆధునికీకరించామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

10న రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు

నంద్యాల(రూరల్): గుడ్‌ఫ్రైడే-ఈస్టర్ పండుగ పురస్కరించుకొని ఈనెల 10వ తేదీన మండలంలోని చాబోలు గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సంఘ పెద్దలు శుక్రవారం తెలిపారు. గెలుపొందిన వృషభాలకు వరుసగా.. రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు దాతల సహకారంతో అందజేస్తామన్నారు. అలాగే.. అదే రోజు సాయంత్రం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు కూడా ఉంటాయని చెప్పారు. 9న ఇసుక బస్తా మోసే పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని వివరించారు.

తీర్మానం ఉపసంహరించుకునేలా చూడండి

నంద్యాల(అర్బన్): బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేలా శాసన సభలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకునేలా సీఎంను ఒప్పించాలని గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ ఆధ్వర్యంలో నాయకులు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కోరారు. నిర్ణయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలంటూ పట్టణంలోని పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు వినతి పత్రం అందజేశారు. విజయ్‌నాయక్, మల్లేష్‌నాయక్, స్వామినాయక్, విక్రంనాయక్, రవినాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

పల్లకీలో ఆది దంపతుల విహారం

మహానంది: స్వయంభువుగా వెలిసిన మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహావాచనం, అలంకార పూజ, అలంకార హారతులు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.

సాంబవరంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

గోస్పాడు: పునరుత్థాన పండుగ సందర్భంగా సాంబవరం గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సంఘం పెద్దలు శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన సైకిల్ స్పీడ్, స్లోపందెం, మోటారు బైక్ స్లో పందెం, ఆటో రివర్స్, ఇసుక బస్తా, గుండు ఎత్తుట, తాడు లాగే పందెం ఏర్పాటు చేశామన్నారు. 10న రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో భాగంగా నాలుగు పండ్ల సైజు ఎద్దుల పోటీలు, 11న ఆరు పండ్ల విభాగం పోటీలు, 12న న్యూకేటగిరీ పోటీలు ఉంటాయని, అలాగే 11న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరుగుతాయని వివరించారు.విజేతలకు బహుమతులను అందజేస్తామని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహాలను పునఃప్రారంభించాలి

నంద్యాల(అర్బన్): రెండేళ్ల క్రితం బొమ్మలసత్రం ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి ముసుగు తొలగించి ఈనెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణ ప్రధాన కూడలిలో పునః ప్రారంభించాలని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్యలు కోరారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట పార్టీ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని టెక్కె, ఎస్‌బీఐ కాలనీ, మూడు రోడ్ల కూడళ్ల వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని పునరుద్ధరించాలన్నారు. ఊకొట్టు వాసు, సలాం, బ్రహ్మరెడ్డి, సత్యరాజ్, రత్నమయ్య పాల్గొన్నారు.